# విపశ్యన మాసపత్రిక

VOLUME:28 NO - 19 1 OCTOBER , 2019

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖెత్త, వనస్థలిపురం, హైదరాబాదు – 70

## "ధర్మవాణి"

*న జచ్చా వసలో హోతి, న జచ్చా హోతి బ్రాహ్మణో !*
*కమ్మునా వసలో హోతి, కమ్మునా హోతి బ్రాహ్మణో !!*
*– సుత్తనిపాతపాళీ – వసలసుత్తం – 142*

**పుట్టుకతో ఎవరూ వృషలుడు (చండాలుడు) కాదు, పుట్టుకతో ఎవరూ బ్రాహ్మణుడు కాదు. వారి వారి కర్మలతోనే వృషలురు అవుతారు, వారి కర్మలతోనే బ్రాహ్మణులు అవుతారు.**

# విపశ్యనా సాధన స్వర్ణ జయంతి సందర్భంగా పూజ్య గురూజీ పట్ల కృతజ్ఞతను ప్రకటించుకునే సదవకాశం

**(మూలం: సెప్టెంబర్ 25, 2018 న వెలువడిన హిందీ మాసపత్రిక )**

*విపశ్యనా సాధన పునఃస్థాపితమయ్యి, 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, ఒక సంవత్సరం పాటు – అనగా 3 జూలై 2018 నుండి 2 జూలై 2019 వరకూ గ్లోబల్ పగోడాలో, ప్రతిరోజూ ఒక్కరోజు శిబిరాలు నియమిత రూపంలో నిర్వహించబడ్డాయి. సాధకుల రోజువారీ సాధనలు పుష్టి చేయటంలో సహాయ పడటానికే ఈ శిబిరాలను నిర్వహించారు. సాధకులకు ఏరోజు సమయం దొరికితే, ఆ రోజు ఈ శిబిరాల నుండి ప్రయోజనం పొందారు. వీటితో సాధకుల సాధనలో కూడా నిరంతరత మరియు క్రమబద్ధత వచ్చి, ఆ తరువాత అలాంటి వారి నుండి ప్రేరణ పొంది, ఇతరులలో సద్ధర్మం పట్ల ఆసక్తి కలిగితే, వీలయినంత ఎక్కువ మంది శిబిరాల్లో పాల్గొని, తమ మేలు చేకూర్చుకుంటారు. ఇదే విధంగా, ఇతర ప్రాంతాల్లో కూడా, రోజువారీ సాధన, సామూహిక సాధన మరియు ఒక్కరోజు శిబిరాల ద్వారా ఈ విద్యలోని వ్యవహారిక పక్షాన్ని అంటే సాధన యొక్క ఆచరణను దృఢపరుచుకోవాలి. ఇదే పూజ్య గురుదేవుల పట్ల మనం చూపించే అసలైన శ్రద్ధాంజలి, నిజమైన కృతజ్ఞత అవుతుంది.*

*విశ్వ విపశ్యనాచార్యులు పూజ్య శ్రీ సత్యనారాయణ గోయంకా గారు శుద్ధ ధర్మ సంపర్కంలోకి రాకముందు జరిగిన సంఘటనలు మరియు బాల్యం నుండి యవ్వన దశ వరకూ వారిలోని భక్తి భావాన్ని గురించి ఎలాంటి భ్రమా కలగకూడదని, ఇంకా ఇలాంటి వ్యక్తి కూడా ఏ విధంగా మారిపోయారో తెలుసుకొని వారి నుండి ప్రేరణ పొందాలనే ఉద్దేశ్యంతో, వారి ఈ సంక్షిప్త జీవిత పరిచయం, వారి మాటల్లోనే* ***– మూడవ భాగం.***

## కృష్ణునిపట్ల చెదరని శ్రద్ధ

**(గత సంచిక తరువాయి భాగం)....** వ్యాపార క్షేత్రంలో మొదటగా, "మార్వాడీ ఛాంబర్ ఆఫ్ కామర్స్"కు అధ్యక్షుడినయ్యాను, ఆ తరువాత బర్మా పౌరసత్వాన్ని పొందిన తరువాత, "రంగూన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్"కు కూడా అధ్యక్షుడినయ్యాను. 'ఊ నూ' ప్రభుత్వంలోని ఆర్థికశాఖా మంత్రి 'ఊ ఔ' గారి శాఖలో వ్యాపార సంబంధ సంప్రదింపుల కోసం కూడా ఎన్నుకోబడ్డాను.

వ్యాపారాలలో విజయం సాధిస్తూనే, నేను నా కుటుంబానికి సంబంధించిన ఎన్నో పరిశ్రమలను స్థాపించి, వాటిలో కూడా ఆశించిన దానికన్నా ఎక్కువ విజయాలు సాధించాను. ప్రభుత్వంతో సత్సంబంధాలు కలిగి ఉన్న కారణంగా, కేవలం "ఊ నూ" ప్రభుత్వంలోనే కాకుండా, సైనికపాలన సమయంలో కూడా రెండుసార్లు ప్రభుత్వ ప్రతినిధుల మండలితో పాటుగా విదేశాలకు వెళ్లి, అక్కడ గొప్ప ఫలితాలను పొందాను.

లౌకికమైన ఈ విజయాల ఘనతనంతా నేను నా ఇష్టదేవునికే సమర్పించేవాడిని. చిన్న వయసులో నేను నా జేబులో పెట్టుకున్న చిత్రపటాన్ని, ఎప్పటికీ నా జేబులోనే పెట్టుకునేవాడిని. విదేశాలలో ప్రయాణం చేసేటప్పుడు కూడా అది నా జేబులోనే ఉండేది! గీతాప్రెస్, గోరఖ్‌పూర్ వారి భక్తి ప్రేరిత రచనల ప్రభావం నా మనసుపై ఎంతగానో ఉండేది. నేను నా ఇష్టదేవుని చిత్రపటాన్ని ముందుంచుకుని ప్రతి ఉదయం అరగంటసేపు సజల నేత్రాలతో ప్రార్థనా గీతాలు పాడుతుండేవాడిని. ఎల్లప్పుడూ భక్తిరసంలో పీకలలోతు వరకూ మునిగి ఉండేవాడిని. "నా ఈశ్వరుడైన శ్రీకృష్ణుని పట్ల నాకున్న భక్తి అడుగడుగునా నాకు సహాయం చేస్తోంది" అనే నమ్మకం నాలో మరింత బలపడుతూ పోయింది.

చిన్నతనంలో మూడవ తరగతి నుండి పదవ తరగతి వరకూ స్థానిక ఖాలసా స్కూలులో చదువుకున్నాను. అక్కడి గురువాణి కూడా నా మనసు మీద ఎంతో లోతైన ప్రభావాన్ని కలిగించింది. అంతకంటే, మా ఇంటి దగ్గరలో ఉన్న ఆర్య సమాజపు శిక్షణ ప్రభావం మరింత ఎక్కువగా ఉండేది. అయితే ఆ ప్రభావం కారణంగా కూడా నేను సగుణ సాకార భక్తిని వదిలి నిర్గుణ నిరాకార భక్తి వైపుకు వెళ్ళనేలేదు. ఎందుకంటే, దానిని నేను భక్తికి యోగ్యమైనదిగా భావించేవాడిని కాదు. అయినప్పటికీ ఆర్య సమాజపు ఎన్నో నమ్మకాలు నా మనసుపై ఎంతో లోతైన ప్రభావాన్ని కలిగించాయి.

ఆ కిషోర స్థితిలోనే సమాజంలోని ఎన్నో దురాచారాలను దూరం చేయాలనే దృఢమైన ఆకాంక్ష నాలో మేల్కొంది. అలాంటి వాటిలో, కేవలం పుట్టుక ఆధారంగానే ప్రజలను ఉన్నత జాతి, లేదా అధమ జాతి వారిగా భావించే ఆచారం నన్నెంతగానో బాధించేది. ఈ కారణంగానే,

నేను అతి ఉత్సాహానికి లోనై, ఆర్య సమాజ మందిరంలో అధమ జాతికి చెందిన కొందరికీ యజ్ఞోపవీతం వేయించి, వారిని ఉన్నత జాతికి చెందిన వారిగా ప్రకటించాను. కానీ, అనుభవరహితమైన ఉత్సాహంతో చేసిన నా ఈ ప్రయత్నం పూర్తిగా విఫలమైంది. దృఢమైన సామాజిక పరంపరల కారణంగా, వాళ్ళంతా వారి పూర్వ స్థితికి వెళ్ళిపోయారు. నేను మళ్ళీ ప్రయత్నించినప్పటికీ, అసహాయుడినయ్యాను. సమాజ వ్యవస్థ లోని పురాతన ఆచారాలు ఎంత కఠోరంగా ఉన్నాయంటే, వాటిని బాగుచేసే అవకాశమే లేకున్నది.

అదే విధంగా నేను నవయౌవన స్థితిలో ఉన్నప్పుడు, సమాజంలో జరుగుతున్న ఒక వృద్ధుని వివాహాన్ని బలంగా ఎదుర్కొన్నాము. నా ఒక యువ మిత్రుని భార్య మరణించింది. ఆ రోజుల్లోనే బాల్య వివాహం చేసుకున్న వేరొక అమ్మాయి వివాహం కాగానే విధవరాలైంది. నవయువకులమైన మేమందరమూ కలిసి, ఆందోళన చేపట్టి, విధురుడైన నా మిత్రునితో ఆ బాల విధవరాలితో వివాహం చేయించటానికి ప్రయత్నించాము. మా అందరి బలవంతంతో, వారు ఒప్పుకున్నా, ఈ విషయం వల్ల సమాజంలో ఎంతో అలజడి చెలరేగింది. నా విధుర మిత్రుని తండ్రి గంగలో (ఇరావదీ నదిలో) మునిగి చనిపోతానని బెదిరించాడు. దాని ఫలితంగా, ఆ వివాహం జరగలేదు.

ఇలాంటి కారణాలతో, సమాజంలో అమలులో ఉన్న నియమాలకు నన్ను విరోధిగా భావించారు. ఇన్ని రకాల ప్రయత్నాల అసఫలత కారణంగా, సమాజంలోని పెద్దల దృష్టిలో నేను ఎంతగానో పతనమైపోయాను.

అయినప్పటికీ, ఆర్య సమాజం వారి ఎన్నో మాన్యతలు, పద్ధతులు నా మనసుపై ఎంతో ప్రభావాన్ని చూపిస్తూ పోయింది. ఇంకా నాలోని సంస్కర్త ప్రవృత్తి కూడా బలపడుతూపోయింది. నా ఇద్దరు అన్నయ్యలు బాలకృష్ణ, బాబూలాల్‌ల వివాహాలు, వారికి దాదాపు 15 సంవత్సరాల వయసు రాగానే చేయబడ్డాయి. కానీ శారదా ఆక్ట్ (బాల్య వివాహ నిషేధ చట్టం 1929) ప్రకారం 18 సంవత్సరాల వయసు వచ్చిన తరువాతనే పెళ్లి చేయాలి. నా వంతు రాగానే, నాకు 18 సంవత్సరాల వయసు వచ్చాకనే వివాహం చేసుకుంటాననే పట్టుతో ఉండిపోయాను. ఈ నిర్ణయానికి మా కుటుంబ సభ్యులు మరియు సమాజం ఒప్పుకోలేదు. ఇంతలోనే ఒక మంచి పరిణామం జరిగింది. అదేమిటంటే – భారతదేశం నుండి వచ్చిన ఒక సుప్రసిద్ధ జ్యోతిష్య పండితుడు, మా ఇంటికి దగ్గరలోని ఆర్యసమాజ భవనంలో కొద్ది రోజుల పాటు బస చేశారు. వారు నా హస్తరేఖలు చూసి, నాకు దీర్ఘాయువైతే ఉంది కానీ, దాదాపు పద్దెనిమిది సంవత్సరాల వయసులో మృత్యు గండం పొంచి ఉంది అని చెప్పాడు. అది వినిన నేను ఎంతో సంతోషించి, వారిని మా ఇంటికి తీసుకుని వెళ్ళాను. అక్కడ ఆయన ఎంతోమంది హస్తరేఖలు చూసి తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. నా వంతు రాగానే, 18 సంవత్సరాల వయసులో మృత్యు గండం ఉంది అని మరొక్కసారి చెప్పారు. దానితో నా పని పూర్తయింది. నేను మా అమ్మతో, “18 సంవత్సరాల కంటే ముందుగా నాకు వివాహం చేసినట్లయితే ఏ పాపం ఎరుగని అమ్మాయి భవిష్యత్తు దుఃఖమయం అయిపోతుంది.” అని చెప్పాను. అమ్మ ఎంతో దయకలది. దానితో ఆమె, 18 సంవత్సరాలు పూర్తి అయ్యాకనే నాకు వివాహం చేయబడుతుంది అని నేను చెప్పిన దానినే సమర్థించారు.

నాలోని విప్లవాత్మక స్వభావానికి సంబంధించిన మరొక సంఘటన. నా ఇద్దరు అన్నయ్యలకూ యజ్ఞోపవీతం (ఉపనయన సంస్కారం కూడా వారి 15 సంవత్సరాల వయసు నాటికే పూర్తయింది. ఇక నేను ఆ వయసుకు చేరుకునేటప్పటికి, మా కుటుంబ పురోహితుని దురాచారాలు సమాజంలో సంచలనం అయ్యాయి. ఒక దురాచార వ్యక్తి నా గురువు కావటానికి వీల్లేదు అని నేను పట్టుబట్టాను. మా ఇంటిలోని మందిరంలో నిత్యపూజలు చేయటానికి తండ్రి గారు ఒక పురోహితుడిని నియమించారు. వారి చేతులమీదుగా యజ్ఞోపవితం తీసుకోమని నన్ను బలవంతపెట్టసాగారు. అయితే కొద్ది రోజుల్లోనే వారి దురాచారాలకు సంబంధించిన సత్యాలు కూడా బయటకు రావటం మొదలవటంతో, నేను వారి చేతుల మీదుగా యజ్ఞోపవీతం తీసుకోవటానికి నిరాకరించాను. కానీ నాపై మరింత ఒత్తిడి పెరగటంతో, అప్పటి ఆర్య సమాజంలో సచ్చరిత్రుడైన వ్యక్తి, పండిత మంగళదేవ శాస్త్రి గారిని నా గురువుగా స్వీకరించి, వారి చేతులమీదుగా ఉపనయన కార్యక్రమం చేయించుకోగలను అనే ప్రస్తావన చేశాను. కానీ, ఆ రోజుల్లో మాండలేలో ఆర్య సమాజీకులకు, సనాతన హిందువులకు మధ్య తీవ్ర విభేదాలు ఉండేవి. దాని పరిణామంగా, ఉద్రిక్తత కూడా ఉండేది. మా కుటుంబీకులు ఎంతో సనాతన హిందువులు కావటంతో, నా ఈ ప్రస్తావనను అంగీకరించలేకపోయారు. దానితో నేను యజ్ఞోపవీతం ధరించకుండానే ఉండిపోయాను. ఆ తరువాత ఈ నాటికీ నేను యజ్ఞోపవీతాన్ని తీసుకోలేదు. ఏది జరిగినా, మంచే జరిగింది అని నేను భావించాను.

ఆ రోజుల్లో నా మనసులో విప్లవాత్మక నిప్పురవ్వ రగిలింది. అది త్వరలోనే ఒక బలమైన జ్వాలగా మారుతుంది అనే విశ్వాసం నాకు అప్పట్లో కలగనే లేదు.

ఆర్య సమాజంతో ఎంతగానో ప్రభావితమై, వారి సమాజోద్ధరణకు చెందిన విషయాలనయితే అంగీకరించాను కానీ, సగుణ సాకార భక్తిలో మునిగిన నా మనసు నిర్గుణ నిరాకారంలో నిమగ్నం కాలేకపోయింది. అసలు నిర్గుణ నిరాకార భక్తి ఎలా ఉండగలదు అని కూడా నాకు అర్థం అయ్యేది కాదు.

ఎన్నో వైఫల్యాల తరువాత కూడా శ్రీకృష్ణుని పట్ల ఉన్న నా భక్తిలో ఏ మాత్రం లోటు రాలేదు. ప్రతిరోజూ ఉదయాన్నే దీక్షగా భక్తి గీతాలు పాడేవాడిని, వాటితో పాటు భగవద్గీతా పారాయణం కూడా చేసేవాడిని. మహాభారతంలో సోదరుల మధ్య జరిగిన యుద్ధంతో, దేశంలో లెక్కలేనంతమంది వీరులు చంపబడ్డారు, ఎన్నో అరుదైన అస్త్రశస్త్రాలు నాశనమైపోయాయి అని నేను గమనించాను. మరి దీనిని మంచిదని నేనెలా అనుకోవాలి? అయితే నా ఇష్టదేవుడు గీతలో స్థితప్రజ్ఞత గురించి చేసిన వ్యాఖ్య నా మనసుకు ఎంతగానో నచ్చి, దానిని జీవితంలో ఆచరించాలనే అభిలాష నాలో కలిగింది.

అదే గీతలో గుణ, కర్మ, స్వభావాల ఆధారంగా చతుర్వర్ణ వ్యవస్థను నా ఇష్టదేవుడు ఈ విధంగా వివరించాడని నేను చదివాను.

**“చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః।**
**తస్య కర్తారం అపి మాం విద్ధి అకర్తారమవ్యయమ్ ॥”**
**– గీత 4/13**

గుణ, కర్మ, ఆచరణల ఆధారంగానే నా చేత చతుర్వర్ణాల సృష్టి జరిగింది. అయినప్పటికీ అవినాశి కర్తనయిన నన్ను అకర్తగానే తెలుసుకో.

కానీ ఇలా చెప్పినప్పటికీ, గుణ, కర్మ, స్వభావాల ఆధారంగా ఏర్పడిన వర్ణ వ్యవస్థ, తరువాతి కాలంలో పుట్టుక ఆధారంగా ఎలా మారిపోయింది? అని చూస్తే బాధగా అనిపించింది. ఒక సరైన వర్ణవ్యవస్థను, కొందరు వ్యక్తులు వారి స్వప్రయోజనం కొరకు, వారి

తరువాతి తరాల కొరకు "మనుస్మృతి" వంటి గ్రంథాన్ని రచించటం ద్వారా దానిని మార్చివేశారు. ఈ మార్పుల కారణంగా అధమ జాతిపై ఉన్నత జాతి ద్వారా చేయబడిన అత్యాచారాలను చూసి మయన్మార్‌లో ఉండగా కూడా చింతిస్తుండేవాడిని, ఇప్పుడు భారతదేశానికి చేరుకున్న తరువాత, ఈ జాతి కూడా అదే దుర్దశలో ఉండటాన్ని గమనించి, నా పరమేశ్వరుడు స్థాపించిన సుందరమైన వర్ణ వ్యవస్థను, సమాజంలోని స్వార్థపరులు ఇంత కలుషితం ఎలా చేయగలిగారు అనే విప్లవాత్మక భావన మనసులో ఉదయించింది. కలుషితం చేసేశారన్నది సత్యమే, కానీ నా ఇష్ట దేవుడయితే పరమేశ్వరుడు, సర్వశక్తిమంతుడు. మరి ఆయన ఈ కాలుష్యాన్ని ఎందుకు నివారించలేదు, ఎందుకు బాగుపరచలేదు? తమ స్వార్థంకోసం ఆరోగ్యవంతమైన వ్యవస్థను కలుషితం చేసిన వ్యక్తులకు కఠోరమైన శిక్షను ఆయన ఎందుకు విధించలేదు? అని ఆలోచించసాగాను.

సంఘ విద్రోహకారకమైన ఉత్తమ – అధమ జాతులు, స్పృశ్యత – అస్పృశ్యత లాంటి జాడ్యాలు సమాజంలో బలంగా పాతుకుపోయి, ఎంత తీవ్ర పరిణామాలకు కారణమయ్యాయో విద్యార్థిగా ఉన్నప్పటి నుంచీ గమనించసాగాను. నా తరగతిలో గురు చరణ్ సింగ్ అనే సహ విద్యార్థి ఉండేవాడు. అతడు ఒక చండాలుని పుత్రుడు. అతడు నాతో పాటుగా నా బెంచీ మీద కూర్చునేవాడు. దాన్ని నా కులంలోని ఇతర విద్యార్థులు ఎంతో చెడుగా భావించేవారు. భోజన సమయంలో మా ఇళ్ళ నుంచి తెచ్చుకున్న భోజనాన్ని అదే బెంచీ మీద కూర్చుని కలిసి భోజనం చేసేవాళ్ళం. నేనెప్పుడూ అతని భోజనం తిననప్పటికీ, ఒక అంటరాని జాతికి చెందిన విద్యార్థితో ఒకే బెంచీపై కూర్చుని భోజనం చేయటం నా ఇతర విద్యార్థి బంధువులకు ఎంతమాత్రం రుచించక, వారు బయటి సమాజంలో కూడా ఈ విషయాన్ని గురించి చర్చిస్తూ, నన్ను నిందిస్తుండేవారు.

ఒక కులంలో జన్మించినంత మాత్రాన, ఒక వ్యక్తి ఎంత సచ్చరిత్రుడైనా అంటరానివాడిగానే ఎందుకు భావించబడుతున్నాడు? అలాగే మరో కులంలో జన్మించినంత మాత్రాన మరో వ్యక్తి ఎంతో దుశ్చరిత్రుడైనా, ఉన్నత జాతి వాడిగానే ఎందుకు భావించబడుతున్నాడు? అనే విషయం నాకు అర్థం అయ్యేదికాదు. ఈ పరిస్థితి నాకెంతమాత్రమూ మింగుడుపడేది కాదు. నా విద్యార్థి దశలోనే కాకుండా, ఆ తరువాత కూడా ఈ దుస్థితిని చూసి నేను ఏమీ చేయలేక, కేవలం బాధపడేవాడిని. మా కుటుంబ పెద్దలతో రైలులో ప్రయాణం చేస్తున్నప్పుడు, మేము ఇంటి నుండి తెచ్చుకున్న భోజనం తినటానికి తయారవుతుండగా, అదే బెంచీలో ఎవరైనా మర్యాదస్తుడైన బర్మీ బంధువు కూర్చుని ఉంటే, నీవు కాసేపు లేచి అలా పక్కకు వెళ్ళు, లేకపోతే మేము భోజనం చేయలేము అని వారితో చెప్పేవాళ్ళం. నేను నాతోటి విద్యార్థితో ఒకే బెంచీలో కూర్చుని భోజనం చేసేవాడిని. కానీ ఇక్కడ, మా ఇంటి పెద్దలు భోజనం చేయటానికి ఒక మర్యాదస్థుడైన బర్మీ వ్యక్తిని నిమ్న జాతివాడిగా భావించి, భోజన సమయంలో సీటు నుంచి లేపేసేవాళ్ళు. ఇది నా మనసుకెంతో బాధగా అనిపించేది. కానీ ఇందులో నేనేమి చేయగలను? ఇంకా మయన్మార్ నుండి భారతదేశానికి వచ్చి, చూరూ నగరంలో ఉంటూ కూడా నేను ఈ ఉత్తమ – అధమ, స్పృశ్యత – అస్పృశ్యతల అత్యంత అప్రియ దురాచారాల పరిణామాల పరాకాష్టను చూశాను. ఇవన్నీ చూసి, నా ఈశ్వరుడైన శ్రీకృష్ణుని పట్ల ప్రగాఢమైన భక్తి శ్రద్ధలు ఉన్నప్పటికీ, అప్పుడప్పుడు, ఏ ఈశ్వరుడయితే ఒక సుందరమైన వర్ణ వ్యవస్థను తయారు చేశాడో, ఆ వ్యవస్థ కలుషితమైపోవటాన్ని చూసి దానిని బాగుపరచటానికి ఆయన ఒక గట్టి నిర్ణయం ఎందుకు తీసుకోలేకపోయాడో అనే విప్లవాత్మక భావనలు మేల్కొనేవి.

బ్రాహ్మణులు, వైశ్యుల ఇళ్ళల్లో జన్మించినందుకు మేము గొప్పవాళ్ళం అయిపోయి, నిమ్న జాతిలో జన్మించిన వారిపైన ఎన్నో అత్యాచారాలు చేశాము అని ఆలోచించేవాడిని. ఇవన్నీ చూసి ఇష్టదేవుని పట్ల భక్తిశ్రద్ధలు ఉన్నప్పటికీ, అప్పుడప్పుడూ నాలోని విప్లవాత్మక స్వభావం మేల్కొనేది. ఆ రోజుల్లో నేను రచించిన పాత రచన నాకింకా గుర్తుంది.

**"బ్రాహ్మణ్ బనియే కే ఘర్ జన్మే, ఇస్ సే హీ క్యా హమ్ హై మహాన్?**
**హమ్ ఉచ్చ్ వర్ణ్, హమ్ సర్వశ్రేష్ఠ్, ఊంచా సమాజ్ మే బనా స్థాన్ ॥"**

(బ్రాహ్మణ, వైశ్యుల ఇళ్ళల్లో జన్మించిన కారణంగా మేము గొప్పవాళ్ళం అయిపోయామా?, ఉన్నత వర్గంగా, అందరికంటే సర్వశ్రేష్ఠులుగా సమాజంలో ఉన్నత స్థానంలో చూపబడుతున్నామా?)

నా పరిస్థితి ఏంతో విచిత్రమైనది. ఒకవైపు నా ఇష్టదేవుని పట్ల లోతైన శ్రద్ధ ఉన్నప్పటికీ మరోవైపు వారిపట్లనే లోతైన తిరుగుబాటు భావనలు – ఈ రెండు పరస్పర విరుద్ధ భావనలూ మనసులో ఒకేసారి నడుస్తుండేవి.

## ద్రవీభూత భక్తి

నేను గీతాప్రెస్, గోరఖ్‌పూర్ వారి భక్తి మార్గం పట్ల ఎంతో శ్రద్ధ కలిగిన తల్లిదండ్రుల ఇంట్లో పుట్టి పెరిగాను. చిన్నప్పటి నుండీ మయన్మార్‌లో గీతాప్రెస్ వారు ప్రచురించిన సాహిత్యానికి నిస్స్వార్థ ప్రచారకులైన మోహన్ మాష్టారు గారు (మదన్ మోహన్ శర్మ గారు) వంటి గురువుల సంసర్కంలోకి వచ్చాను. వారు స్వయంగా పరమ భక్తులు. భక్తి భజనలు పాడుతూ వారి హృదయం ప్రసన్నత చెంది, కళ్ళ నుండి అశ్రుధారలు ప్రవహించసాగేవి. నేను కూడా స్వభావసిద్ధంగా ఎంతో భావావేశం కలిగి ఉండేవాడిని. ఈ కారణంగా మా గురువు గారి లాగా నేను కూడా సగుణ సాకార భక్తి పట్ల పరవశం చెంది, తరుచూ కన్నీటిపర్యంతం అయ్యేవాడిని. దాదాపు ఏడు సంవత్సరాల వయసులో గీతాప్రెస్ వారు ముద్రించిన "భక్త బాలక్", "భక్త నారి" వంటి పుస్తకాలను మా అమ్మగారికి చదివి వినిపిస్తూ, ఎన్నోసార్లు నేను భక్తి భావంలో కరిగిపోయిన విషయం నాకింకా గుర్తుంది. కళ్ళ నుండి అశ్రుధార ప్రవహించేది. భక్తి భావంతో నిండిన ఆ కథలను వింటూ – వింటూ అమ్మగారి కళ్ళ నుండి కూడా కన్నీరు ప్రవహించేది. నన్ను తన ఒడిలో కూర్చోబెట్టుకుని గుండెకు హత్తుకునేది. నేను తనతో, "అమ్మా, నేను ధ్రువుడిని అవుతాను" అని అనేవాడిని, సమాధానంగా అమ్మ, "అవును నాయనా, నీవు ధ్రువుడవు అవుతావు" అని అనేవారు. ఈ ద్రవీభూత భక్తిలో నేను కొన్ని సంవత్సరాల పాటు నిమగ్నమై ఉన్నాను.

మా తండ్రి గారు శివభక్తులు అయిన కారణంగా, శివుడు నా ఆరాధ్య దేవుడు అయ్యారు. మా అమ్మగారు కృష్ణుని భక్తులయిన కారణంగా, కృష్ణుడు కూడా నా ఆరాధ్య దేవుడు అయ్యారు. మా తాత గారు బుద్ధుని పట్ల ఎంతగానో మొగ్గుచూపేవారు. వారు మాండలేలోని సత్యనారాయణుని మందిరానికి వెళ్ళినా, వెళ్ళకున్నా, ప్రతీ వారమూ కనీసం ఒక్కసారి అయినా మాండలే ఉపనగర పొలిమేరల్లో ఉండే పురాతన ఇతిహాసిక మహాముని మందిరానికయితే తప్పకుండా వెళ్ళేవారు. నేను కూడా వారి వెంట వెళ్ళేవాడిని. ఆ దివ్యమైన మందిరంలో, ప్రశాంతంగా ధ్యానంలో నిమగ్నమై ఉన్న బుద్ధ భగవానుని ముఖం నాకు ఎంతో ఆకర్షణీయంగా అనిపించేది. నేను రెప్పవాల్చకుండా, ఎంతో సేపు దానినే చూస్తూ ఉండేవాడిని. మందిరంలోని విశాల ప్రాంగణంలో భక్తుల రద్దీ ఉన్నప్పటికీ స్వచ్ఛత

మరియు ఎంతో ప్రశాంతత నిలిచి ఉండేవి. అది నా బాల్య హృదయానికి ఎంతో ఇష్టంగా అనిపించేది. ఆ ప్రశాంత వాతావరణంలో తాతగారు బాసింపట్లు వేసుకుని కళ్ళు మూసుకుని చాలాసేపటి వరకు మౌనంగా కూర్చుని ఉండేవారు. వారు ఏదైనా ధ్యానం చేసుకునేవారా లేదా మౌనంగా ఉంటూ మందిరంలోని ప్రశాంతతను ఆస్వాదించేవారా అనేది నాకు తెలియదు. ఎన్నోసార్లు నేను కూడా వారి పక్కనే బాసింపట్లు వేసుకుని కూర్చునేవాడిని. అది నాకు ఎంతో నచ్చేది. ఇక శివుడు, శ్రీకృష్ణులతో పాటుగా బుద్ధ భగవానులు కూడా నా ఆరాధ్యులు అయ్యారు. మా ఇంటిలోని మందిరంలో రవివర్మ గీసిన రెండు పెద్ద సైజు చిత్రపటాలు ఉండేవి. వాటిలో ఒకటి శివునిది, మరొకటి శ్రీకృష్ణునిది, కానీ బుద్ధుని పట్ల నాలో ఉన్న భక్తి శ్రద్ధలను మహాముని మందిరానికి వెళుతూ, వెళుతూ దృఢపరుచుకునే వాడిని.

## మహాదేవ నాథానీ గారు

నాకు మహాదేవ నాథానీ అని ఒక బావ గారు ఉండేవారు. మా పెద్ద అక్క భర్త. వారు మా కుటుంబ వ్యాపార కార్యకలాపాలను చెందిన లెక్కలు రాసేవారు. వయసులో నాకంటే దాదాపు 20 సంవత్సరాలు పెద్దవారు. వారి జీవితం ఎంతో ధార్మికంగా, సాత్వికంగా త్యాగాలతో కూడి ఉండేది. వారి ఆదర్శ జీవనచర్య నన్నెంతగానో ప్రేరేపించేది. వారు సంస్కృతంలో పేరుమోసిన విద్వాంసులు. ఏదో పుస్తకంలో సంస్కృత పండితులు రాసిన ఏదయినా అంశం మీద వారు విశ్లేషించి చెప్పటం నేనెన్నోసార్లు చూసాను. అందరూ వారి పాండిత్యాన్ని గౌరవించేవారు.

నేను ఆ చిన్ని వయసులోనే విష్ణుసహస్రనామం, గోపాలసహస్రనామం, శివమహిమస్తోత్రం, శివతాండవ స్తోత్రం మరియు శ్రీమద్భగవద్గీతలు పారాయణ చేయటం నేర్చుకుంటూ ఉండేవాడిని. వారెన్నోసార్లు నా సంస్కృత ఉచ్చారణను సరిచేసేవారు. అది నాకు ఎంతగానో నచ్చేది. వారి మాటల్లో ఎంతో మహత్యం ఉండేది. వారు రుద్ర పాఠాన్ని పఠిస్తే, వాయుమండలమంతా మృదంగపు ధ్వని మారుమ్రోగినట్లు అనిపించేది.

నేనెన్నోసార్లు తాతగారితో పాటు మహాముని మందిరానికి వెళ్లివచ్చాక ఆయన, "బుద్ధ భగవానుడు విష్ణువు యొక్క తొమ్మిదవ అవతారం, కాబట్టి మనకు పూజ్యులు. వారి మందిరానికి వెళ్లి తలవంచి నమస్కరించటంలో ఎటువంటి దోషమూ లేదు. కాకపోతే ఎప్పటికీ, పొరపాటున కూడా వారి బోధనల చిక్కుల్లో పడిపోవద్దు, వారి బోధనలు స్వీకరించదగినవి కావు. దుష్టప్రజలు స్వర్గానికి కాకుండా నరకానికి వెళ్ళేలా, వారిని తప్పుదోవ పట్టించటానికి వారికి బోధనలు ఇవ్వటానికే విష్ణుమూర్తి బుద్ధుని అవతారమెత్తాడు." అని నాకు చాలాసార్లు వివరించేవారు. దానికి సంబంధించిన ఏదో శాస్త్రంలోని ఏదో శ్లోకం చదివి వినిపించేవారు. ఇప్పుడయితే ఆ శ్లోకం తప్పకుండా విష్ణుపురాణం లోనిదే అయి ఉంటుందని అనిపిస్తుంది. దానితో నాకే సంబంధమూ లేదు కానీ, ఎవరినో తప్పుదోవ పట్టించటానికి ఈశ్వరుడు ఎందుకు అవతారం ఎత్తారు? అని ఆలోచించి అర్థం చేసుకునే సామర్థ్యం నాకు ఆ బాల్యస్థితిలో లేకున్నది. అయితే బావగారి పట్ల ఉన్న గౌరవ శ్రద్ధల కారణంగా, బుద్ధుడు మనకు పూజ్యనీయులే, కానీ వారి బోధనలు ఏ విధంగానూ గ్రహింపదగినవి కావు అన్న మాటలు మనసులో బలంగా పాతుకుపోయాయి.

– తరువాయి భాగం వచ్చే సంచికలో.

– **ఆత్మ కథన్ 2** నుండి గ్రహించబడింది.

## కిషోర శిబిరాలు

బాలికలు: 17 అక్టోబర్ నుండి 25 అక్టోబర్ వరకు – ధమ్మనాగాజ్జునలో
బాలురు: 30 నవంబర్ నుండి 08 డిసెంబర్ వరకు – ధమ్మనాగాజ్జునలో
బాలికలు: 23 డిసెంబర్ నుండి 31 డిసెంబర్ వరకు – ధమ్మనాగాజ్జునలో

## గంభీర, దీర్ఘ శిబిరాలు

సతిపట్ఠాన సుత్త శిబిరం: 16 అక్టోబర్ నుండి 24 అక్టోబర్ వరకు – ధమ్మనాగాజ్జునలో
సతిపట్ఠాన సుత్త శిబిరం: 02 నవంబర్ నుండి 10 నవంబర్ వరకు– ధమ్మవిజయలో
సతిపట్ఠాన సుత్త శిబిరం: 17 డిసెంబర్ నుండి 25 డిసెంబర్ వరకు– ధమ్మఆరామలో
20–రోజుల శిబిరం: 4 నవంబర్ నుండి 25 నవంబర్ వరకు – ధమ్మకొండన్నలో
45–రోజుల శిబిరం: 29 అక్టోబర్ నుండి 14 డిసెంబర్ వరకు – ధమ్మనాగాజ్జునలో
45–రోజుల శిబిరం: 22 డిసెంబర్ నుండి 06 ఫిబ్రవరి 2020 వరకు – ధమ్మనాగాజ్జునలో


**రెండు సంవత్సరాలకు చందా రూ 100/–** **విపశ్యన తెలుగు మాసపత్రిక** **జీవిత చందా రూ. 500/–**

**ప్రచురణ తేది: ప్రతినెల 30/31** **పోస్టింగ్ తేది: ప్రతి నెల 1/2** **వెల: రూ 5/–**

**విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070.**

**ఫోన్: 24240290 (ధ్యానకేంద్రం) ఆఫీసు పనిచేయు వేళలు: ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు**

Postal Reg. HSE/864/2019-2021 RNI Reg. No. APTEL/2006/17745


**PRINTED MATTER**


If Undelivered please return to :

**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org



Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam.
Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.